దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సమ్మేళనానికి హాజరైన దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులు, అధికారులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 1: దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిణి శైలజ, చైర్మన్ ముత్తినేని వీరయ్య తదితరులు హాజరయ్యారు. దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన ప్రధాన కార్యదర్శి శైలజ, చైర్మన్ వీరయ్యకు విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు.

గుడిని శుభ్రంగా ఉంచుకోవాలి

రుద్రూర్, డిసెంబర్ 1: గుడిని, బడిని శుభ్రంగా ఉంచుకోవాలని ధర్మ జాగరణ హిందూ చైతన్య రథయాత్రలో స్వామీజీలు చెప్పడంతో సులేమాన్ నగర్ గ్రామంలో ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గుడి శుభ్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మ రక్షా సమితి సభ్యులు సాయి ఫణీంద్ర, కిట్టు, కృష్ణ, మహేశ్, రామ్ చరణ్, సచిన్, అజయ్, శివకుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు

కంఠేశ్వర్, డిసెంబర్ 1: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో మంగళవారం ఉదయం 7 గంటలకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రటరీ నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఒరిజినల్ బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు.

భార్య రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

వినాయక్‌నగర్, డిసెంబర్1: తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓవ్యక్తి శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై గంగాధర్ కథనం మేరకు.. స్థానిక నాగారంలోని 80 క్వార్టర్స్ ఏరియాకు చెందిన మీసాల కృష్ణ(44) టీ స్టాల్ నడుపుతుండేవాడు. మద్యానికి అలవాటు పడి తరుచూ తన భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. దీంతో ఆమె తన తల్లిగారి ఇంటికి తిరిగి రాలేదు. మనస్తాపానికి గురైన కృష్ణ మద్యం మత్తులో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

వినాయక్‌నగర్, డిసెంబర్1: నిజామాబాద్ నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నవంబర్ 25న జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. సంతోష్‌నగర్‌కు చెందిన వాస్టర్ రాజేశ్(51) నవంబర్ 25న అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నగరంలోని గాజుల్‌పేట్‌కు చెందిన రాంజీ భీమల్ బాడీ, షేక్ సికందర్ వాస్టర్ రాజేశ్‌తో కలిసి గతనెల 25న ముస్తయి దర్గా చౌరస్తా వద్ద మద్యం సేవించారు. అనంతరం వీరి మధ్య గొడవ జరగడంతో భీమల్‌బాడీ, షేక్ సికందర్ కలిసి రాజేశ్‌ను నెట్టివేశారు. కింద పడిన రాజేశ్ తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు చేసిన నేరాన్ని అంగీకరించారు. ఇద్దరుపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

4న సరస్వతీరాజ్ పురస్కారాలు అందజేత

సుభాష్‌నగర్, డిసెంబర్ 1: ఈనెల 4న స్థానిక నవ్యభారతి గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో 6వ మహాసభ నిర్వహిస్తామని, ఇందులో భాగంగా సాహితీ రంగంలో విశేష సేవలను అందించిన ఐదుగురు కవులు, కవయిత్రులకు సరస్వతీరాజ్ పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ సంఘం ఉపాధ్యక్షుడు తిరుమల శ్రీనివాస్ ఆర్య తెలిపారు. ఇందూరు యువత కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి సాహిత్య పురస్కారం ప్రముఖ కవయిత్రి అన్నం పద్మజారెడ్డి, కామినేని రేణుక, మఠం సుజాత, బహుగ్రంథకర్త మల్లవరపు చిన్నయ్య, నవల రచయిత డాక్టర్ పొత్తూరి లక్ష్మణ్‌కు అందజేయనున్నట్లు చెప్పారు. హరిదా తెలంగాణ విశిష్ట సాహితీ పురస్కారాన్ని డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డికి ప్రధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పురస్కార కార్యక్రమం అనంతరం రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తామని వివరించారు. దారం గంగాధర్, పంచారెడ్డి లక్ష్మణ్, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి హరికథ జయంతి మహోత్సవాలు

సుభాష్‌నగర్, డిసెంబర్1: హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి, లక్ష్మీనారాయణ భాగవతుల 126వ హరికథ జయంతి మహోత్సవాలు ఈనెల 7 నుంచి 12 వరకు హైదరాబాద్ నల్లకుంట శృంగేరి శంకర మఠంలో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి శంకర్ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో నగరానికి చెందిన హరికథ కళాకారుడు ఎస్.చిరంజీవాచార్యులు ఆధ్వర్యంలో ద్రౌపతి స్వయంవరం హరికథా గానం ఈనెల 9న ఉంటుందని నిర్వాహకులు వివరించారు. ఈ ధార్మిక కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కలప స్వాధీనం

సిరికొండ, డిసెంబర్ 1: మండలంలోని రావుట్ల సెక్షన్ పరిధిలోని మెట్టు తండాలో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన టేకు కలప (సుమారు 24 దుంగలు) డంపును రావుట్ల సెక్షన్ అధికారులు ఆదివారం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, అక్రమంగా డంపు చేసిన వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

నిరంతరం క్రీడల సాధన చేయాలి

బహుమతులు సాధించిన క్రీడాకారులతో ఏసీపీ

కంఠేశ్వర్, డిసెంబర్ 1: జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాలిటెక్నిక్ మైదానంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఏఆర్ ఏసీపీ కందునూరి నాగయ్య హాజరై మాట్లాడారు. యువత సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ ఏదో క్రీడను ఎంచుకుని నిరంతరం సాధన చేయాలని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న నేషనల్ మాస్టర్ ఫిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ తాము 45ఏండ్ల వయస్సులో క్రీడల్లో పాల్గొనడం ప్రారంభించానని, తనకు ఇప్పుడు 80 ఏండ్ల వయస్సు ఉన్నప్పటికీ స్విమ్మింగ్, సైక్లింగ్ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారు. ఉదయం ఈ క్రీడాపోటీలను జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీనునాయక్, బద్దం గోపిరెడ్డి ప్రారంభించారు. 30 నుంచి 75 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనకు తరలిన నాయకులు

రుద్రూర్ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్తున్న మాల సంఘం సభ్యులు, యువత

బోధన్/నవీపేట/ధర్పల్లి/ఇందల్‌వాయి/రుద్రూర్/సిరికొండ, డిసెంబర్ 1: హైదరాబాద్‌లో జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు ఆదివారం జిల్లాలోని పలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బోధన్ పట్టణం, మండలం నుంచి పెద్ద సంఖ్యలో మాల సంఘం నాయకులు బయల్దేరారు. తరలివెళ్లిన వారిలో ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగుల గిడ్డంగుల సంఘ ఉభయ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి కోటేశ్వర్‌రావు, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్, మాల మహానాడు జిల్లా మాజీ అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య , సింగడి పాండు , పల్లటి యాదగిరి, కారం స్వామి తదితరులు ఉన్నారు. నవీపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన వందలాది మంది మాలలు తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో లింగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బత్తూర్ సాయిలు, మాల మహానాడు నాయకులు దొంత ప్రవీణ్‌కుమార్, కమలాకర్, బీర్‌పూరి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు. ధర్పల్లి మండలం

ధర్పల్లి నుంచి..

నుంచి పోతరాజు, డాక్టర్ రాజు, హెబ్బైజర్, లక్పతి, రాజేశ్వర్ యువకులు వెళ్లారు. ఇందల్వాయి మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాలల సింహగర్జనకు తరలివెళ్లారు. రుద్రూర్ మండల నాయకులు గైని నవీన్, కిశోర్, సాయి, సతీశ్ తదితరులు తరలివెళ్లారు. సిరికొండ మండలంలోని మాల సంఘాల నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ములుగురు రాజేశ్వర్, రిక్క సామెల్, దడివే సంజీవ్ తదితరులు ఉన్నారు.

కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మశాలీ సంఘ సభ్యులు

ఖలీల్‌వాడి, డిసెంబర్1: నగరంలోని గాజుల్‌పేట్ రాంమందిర్ 13వ తర్ప పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎనుగందుల సుభాష్, ఎనుగందుల మోహన్, నారాయణతోపాటు కార్యవర్గ సభ్యులతో నగర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుజ్జేటి వెంకట నర్సయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా నుడా చైర్మన్ కేశ వేణు హాజరై మాట్లాడారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదిగేందుకు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, యాదగిరి, పూల్గం హన్మాండ్లు, భూమేశ్వర్, గంగాదాస్, రాజేశ్వరి, గుండయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరి అపార్ట్‌మెంట్ కార్యవర్గం

ఎన్నికైన నూతన కార్యవర్గం

ఖలీల్‌వాడి, నవంబర్ 30: నగరంలోని గంగాస్థాన్ ఫేస్-2లో ఉన్న ప్రొద్దుటూరి అపార్ట్‌మెంట్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి, కార్యదర్శిగా గంగాధర్, కోశాధికారిగా లక్ష్మణ్, సంయక్త కార్యదర్శులుగా ఆదిత్య, కీర్తిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా విజయ్‌కుమార్, సిద్దిరామేశ్వర్ వ్యవహరించారు.

ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

కోటగిరి(పోతంగల్), డిసెంబర్ 1: కోటగిరి మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండ రాజు, ఉపాధ్యక్షుడిగా బి.యోగేశ్, కార్యదర్శి మాశెట్టి సాయికుమార్, కోశాధికారిగా ఓరగంటి లక్ష్మీరాజు, సలహాదారులుగా నూకల రమేశ్, మహజన్ విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పోల విఠల్, మాశెట్టి నర్సయ్య, పోల అశ్వినీ సేట్, శ్రీనివాస్, మాశెట్టి మహేశ్, లక్ష్మీ కాంత్, మహజన్ రాఘవేంద్ర, నాగేల్లి శ్రీనివాస్, బాలాజీ, నరేందర్ తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు

కోటగిరి(పోతంగల్), డిసెంబర్1: కోటగిరి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏడుగురు కానిస్టేబుళ్లు ఆదివారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఖాళీలు ఉండడంతో కొత్తగా శిక్షణ పొందిన వారితో భర్తీ చేశారని అన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

వీఆర్‌ఈసీలో విద్యార్థుల ఫ్రెషర్స్ డే

నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మాక్లూర్, డిసెంబర్ 1 : మండలంలోని దాస్‌నగర్ వీఆర్‌ఈసీ కళాశాలలో ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆదివారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, సెక్రెటరీ అమృతలతారెడ్డి, ప్రిన్సిపాల్ గణేశ్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్, ఎంబీఏ హెచ్‌వోడీ శ్రీకాంత్ నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పద్మశాలీ నూతన కార్యవర్గం ఎన్నిక

బోధన్, డిసెంబర్ 1: బోధన్ పట్టణంలోని పద్మశాలీ సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా గుర్రం సంతోష్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ్ మహేశ్, కోశాధికారిగా బిల్ల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మునిగిరి నవీన్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా శ్యామల శివకుమార్‌ను ఎన్నుకున్నారు. సభ్యులుగా చింతకింది రమేశ్, కలకోకల నవీన్, మోత్కూరు స్వరూప, కార్యదర్శిగా బేతి గంగారాం, గంగుల శ్యామ్, చిలుక విజయ్, నిగ్గ రమాదేవిని ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★ డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-326605
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్1: పట్టణ శివారులో సుభాష్ నగర్ వంతెన వద్ద ఆర్టీసీ బస్సు, టాటా ఏసీ వ్యాన్‌ను ఢీ కొన్న ఘటనలో టాటా ఏసీ వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆర్మూర్ నుంచి నందిపేట్‌కు వెళ్తన్న కోడిగుడ్ల వ్యాన్ లోడ్‌తో వెళ్తున్న టాటా ఏసీ వ్యాన్ పట్టణంలోని సుభాష్ నగర్ వంతెన వద్ద ఢీ కొన్నాయి. బస్సు వేగంగా రావడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కాగా టాటా ఏసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు

ముగ్గురు కొత్త రేషన్ డీలర్లు

రెంజల్, డిసెంబర్ 1 : మండలంలో ఖాళీ ఏర్పడిన గ్రామాలకు కొత్తగా రేషన్ డీలర్లను నియమించినట్లు తహసీల్దార్ దాసరి శ్రావణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నీలా, బాగేపల్లి, కూనేపల్లి గ్రామాల్లో ఇన్‌చార్జిగా కొనసాగుతున్న రవీంద్రబాబు, అరుణ, శంకర్ స్థానంలో కొత్తవారిని నియమించామన్నారు. నీలాకు రహిన్నిసా, బాగేపల్లికి అగంటి నవ్యత, కూనేపల్లికి సంతోషిణి నియమించామని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నందిపేట్, డిసెంబర్ 1 : మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన నగేశ్ అనే యువకుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా కుటుంబానికి పెద్ద దిక్కైన నగేశ్ మృతి చెందడంతో కుటుంబం వీధిన పడింది. వెల్మల్‌కు చెందిన మయూరి యూత్ సభ్యులు 60 వేలు పోగు చేయగా ఆ యూత్ స్ఫూర్తితో మరికొన్ని యూత్‌లు డబ్బులను పోగు చేయగా మొత్తం రూ.1,30,000/లను జమ చేసి ఆదివారం బాధిత కుటుంబీకులకు అందజేశారు.

త్రివేణి సంగమ క్షేత్రానికి కార్తీక శోభ

కందకుర్తి పుష్కర ఘాట్ వద్ద భక్తుల రద్దీ

రెంజల్, డిసెంబర్ 1 : మండంలోని కందకుర్తి గోదావరినదిలో ఆదివారం పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కార్తీక మాసం చివరి ఆదివారం కావటంతో ఉదయం నుంచే భక్తులు చేరుకోవడంతో త్రివేణి సంగమ క్షేత్రం కార్తీక శోభ సంతరించుకుంది. నదిలోని నిండు కుండలా దర్శనమిస్తున్న పురాతన శివాలయాన్ని నది తీరం నుంచే మొక్కులు చెల్లించుకున్నారు.అహల్యబాయి పుష్కర ఘాట్, నది ఒడ్డున శివాలయం వద్ద మహిళలు దీపాలు వెలిగించి పర్వదినం ప్రాముఖ్యతను చాటారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నందిపేటలో విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఎస్సై, ఎంఈవో

బోధన్‌రూరల్/నవీపేట/బాల్కొండ/భీమ్‌గల్/మోర్తాడ్/మాక్లూర్/నందిపేట్/ధర్పల్లి/చందూర్, డిసెంబర్ 1 : ప్రజాపాలన వియోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బోధన్ పట్టణంలోని డిప్యూటీ డీఈవో కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బోధన్ ఎంఈవో నాగయ్య హాజరై మాట్లాడారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సూర్యకుమార్, విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు నగేశ్, చక్రవర్తి, సీఆర్పీ విజయ్‌తో పాటు తదితరులున్నారు. నవీపేట మండల కేంద్రంలోని స్థానిక బాలుర పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి సింధూషా (బినోలా) , ద్వితీయ బహుమతి ఇందూప్రియ లిటిల్ ఫ్లవర్ స్కూల్ (నవీపేట), తృతీయ బహుమతి లక్ష్మీప్రసన్న కేజీబీవీ (మోకన్‌పల్లి) గెలుపొందారు. విజేతలకు ఎంఈవో అశోక్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి శివకుమార్, బహుమతులను ప్రదానం చేశారు. బాల్కొండ మండలంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో జడ్పీహెచ్‌ఎస్ బాల్కొండకు చెందిన భవిత ప్రథమ స్థానం, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు చెందిన రాజేశ్వరి ద్వితీయ, తెలంగాణ మోడల్ స్కూల్ చెందిన సహస్ర శోధిత తృతీయ స్థానాలను పొందారు. కార్యక్రమంలో కిసాన్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజేంద్రకుమార్, ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. జడ్పీహెచ్‌ఎస్(బాలికలు) భీమ్‌గల్‌లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో స్వామి బహుమతులు అందించారు. కార్యక్రమంలో గట్టు ఈశ్వర్, భూమేశ్వర్, రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మోర్తాడ్‌లో నిర్వహించిన పోటీల్లో అనుశ్రీ, కార్తీక, అస్మిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఎంఈవో సమ్మిరెడ్డి బహుమతులను అందజేశారు. కమ్మర్‌పల్లి మండలంలో షాలిని, రుచిత, మహేశ్ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. వీరికి ఎంఈవో ఆంధ్రయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు కృష్ణకుమార్, రాజేశ్వర్, కిషన్, రమేశ్, సబిత, శైలజ, వేణుగోపాల్, అశోక్, నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని మానిక్‌బండార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో సత్యానారాయణ తెలిపారు. ప్రథమ స్థానంలో స్వాతిక్ మాక్లూర్ పాఠశాల, ద్వితీయ, తృతీయ స్థానాలు అక్షయ, వర్ష, కెజీబీవీ పాఠశాల విద్యార్థులు గెలుపొందగా వారికి బహుమతులు అందజేశామన్నారు. నందిపేట్ మండల విద్యాశాఖ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో టి.శైని పదవ తరగతి జడ్పీహెచ్‌ఎస్ వెల్మల్ ప్రథమ స్థానం, ఎన్.నాగలక్ష్మి పదవ తరగతి, అక్షరపాఠశాల నందిపేట్, శెరియా, పదవ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ అయిలాపూర్ తృతీయ స్థానంలో నిలవగా ఎస్సై హరిబాబు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో గంగాధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కేజీబీవీ, ఆదర్శ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు ధర్పల్లి మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎంఈవో రమేశ్‌కుమార్ బహుమతులను అందజేశారు. చందూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపిక

రెంజల్, డిసెంబర్ 1 : మండలంలోని సాటాపూర్ తాజా మాజీ సర్పంచ్ వికార్‌పాషాను బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ)జాతీయ ఉత్తమ ప్రజాప్రతినిధిగా, సంఘ సేవకుడిగా హైదరాబాద్‌లోని నాచారం జాతీయ కార్యాలయంలో నిర్వహించిన ఎంపిక కార్యక్రమంలో ఎంపిక చేసి సంఘం జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్ల రాధాకృష్ణ, సుబ్రహ్మణ్యం ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈనెల 15 న్యూ ఢిల్లీలో నిర్వహించే జాతీయ బహుజన సాహిత్య అకాడమీ తరపున ఉత్తమ సర్పంచ్ జాతీయ అవార్డు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

లింబాద్రి గుట్ట వద్ద మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

భీమ్‌గల్, డిసెంబర్ 1 : ప్రముఖ పుణ్యక్షేత్రం లింబాద్రి లక్ష్మీ నర్సింహస్వామిని చొప్పదండి మాజీ శాసనసభ్యుడు రవిశంకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనవెంట మున్సిపల్ కౌన్సిలర్లు నర్సయ్య, సతీశ్‌గౌడ్, లింబాద్రి ఉన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 1: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చరిత్ర, స్టాటిస్టిక్స్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల కోసం మహిళ